క్లుప్తంగా

భూ రికార్డుల స్వచ్ఛీకరణే లక్ష్యం



మాచర రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం: భూ రికార్డుల స్వచ్ఛీకరణే లక్ష్యంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. మండలంలోని మాచరలో గురువారం సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సదస్సును నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

'మంతెన'కు ఎమ్మెల్సీ తోట పరామర్శ

రాయవరం: భార్య వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత మంతెన అచ్యుతరామరాజును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఈ నెల 21న అచ్యుతరామరాజు సతీమణి వెంకటరామలక్ష్మి వయోభారంతో మృతి చెందారు. మృతురాలి భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం కాకినాడ జీజీహెచ్‌కు అప్పగించడం అభినందనీయమని అచ్యుతరామరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ త్రిమూర్తులు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం సబ్‌డివిజన్ ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ సెక్షన్‌లో సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాళ్లపొలం, జేకే పాలెం, నెలపర్తిపాడు, మామిడిగుంట, వెలంపాలెం, ఉట్రుమిల్లి, గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

వరిసాగులో నాట్లే కీలకం

కాజులూరు: వరిపంటల సాగులో నాట్లు దశ కీలకమైందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులకు నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూడడం, పైపైనే నాట్లు వెయడం, కుదురుకు రెండు నుంచి మూడు మొక్కలు ఉండేలా జాగ్రత్తలు తీసుకొవాలన్నారు. నాటే ముందు వరి మొక్క సుతలను తుంచి నాటాలని దీని వల్ల ఆకు సుతల్లో ఉండే హిస్ప, కాండ తొలుచు పురుగు గడ్డు ప్రధాన పంటకు సోకకుండా జాగ్రత్త తీసుకున్నట్లవుతుందన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేట రాక్ చర్చిలో బుధవారం రాత్రి క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. చర్చి పాస్టర్ బిషప్ కనికెళ్ల ఆనంద్ కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అర్ధరాత్రి వరకూ చిన్నారులు, యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. జేమ్స్, పల్లి ప్రతాప్, పలివెల సుధీర్ కుమార్, కనకరత్నం, టీచర్ వరలక్ష్మి చిన్న పిల్లలకు బహుమతులు అందించారు. బేబీ రత్న కుమారి గ్రామ పెద్దలు క్రైస్తవులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి రాట ముహూర్తం

రామచంద్రపురం: పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీసీతారామ భక్త వీరాంజనేయ స్వామివారి ఆలయం వద్ద ఈనెల పదో తేదీన ముక్కోటి ఏకాదశి మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు గురువారం రాట ముహూర్తం చేశారు. కొండ్రెడ్డి లక్ష్మణరావు చేతుల మీదుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రపురం: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని రామచంద్రపురం పార్టీ సీనియర్ కార్యవర్గ సభ్యులు పి.నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు నరసింహారావు, పి.రాము, వి.గోపాలరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 26 డిసెంబర్ 1925 తేదీన కాన్పూర్‌లో పుట్టిందన్నారు. పుట్టుకతోనే వలస పాలకులైన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెట్టిన అనేక కుట్ర కేసులను ఎదుర్కొంటూనే పోరాటాలు కొనసాగించిందన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, దున్నే వాడికి భూమి కావాలని, కార్మికులకి 8 గంటల పని దినాలు కావాలని డిమాండ్ చేసి సాధించినట్టు వివరించారు.

వామ్మో.. చలి..

- వేగంగా వీస్తున్న శీతల గాలులు
- తగ్గిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- వణికిపోతున్న ప్రజలు



కె.గంగవరంలో ఉదయం 7 గంటలకూ వదలని మంచు

కె.గంగవరం: చలి పంజా విసురుతోంది. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు వదలడం లేదు. సాయంత్రం ఐదున్నర గంటలకు నుంచే చలి గాలి చంపేస్తోంది. రాత్రి 10.30 గంటల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పడిపోవడంతో చలితీవ్రత అంతకంతకు పెరిగిపోతోంది. అర్ధరాత్రి 2గంటల నుంచి ఉదయం 6 గంటలకు వరకు మంచు కురుస్తుండడంతో వాహనదారులు ప్రయాణం చేయలేక వణికిపోతున్నారు. తలకు టోపి, ముఖానికి మఫ్లర్‌తో పాటు శరీరానికి రక్షణగా స్వెటర్లు వేసుకుంటున్నప్పటికీ చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందలేకపోతున్నారు.

వణుకుతున్న చిన్నారులు, వృద్ధులు

గడచిన నాలుగు రోజులుగా రికార్డు స్థాయిలో 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలితీవ్రత మరింత ఎక్కువగా ఉంది. ప్రజలు రాత్రి, తెల్లవారు జామున బయటకు రాలేకపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. శీతగాలుల నుంచి వ్యాధులు పొంచి ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పెరిగిన చలితో శ్వాసకోశ, ఆస్తమా, ఉపిరితిత్తులు సంబంధిత రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది చలికి తట్టుకోలేక నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో సుమారు 25 మంది వృద్ధులు చనిపోయారు. కచ్చితంగా సూచనలు, సలహాలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కె.గంగవరం, కాజలూరు మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. ప్రస్తుతం పొలం పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో తెల్లవారు జామున పనులకు వెళ్లేందుకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. చలితీవ్రత తట్టుకోలేక ఉదయం 7 దాటిన తరువాత కానీ పనులకు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

ఫ్రిజ్‌లో ఆహారం తినొద్దు

చలికాలంలో రిఫ్రిజిరేటర్‌లో ఉండే ఆహార పదార్థాలు తినకూడదని వైద్యులు సూచిస్తున్నారు. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. టీ, కాఫీలు తగ్గించాలి. మద్యానికి దూరంగా ఉండాలి. షాయాలు, హెర్బల్ టీలు తాగొచ్చు. దీంతో శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉంటుంది. తగినంత నీటిని తీసుకుంటే ద్రవాలు అంది జీవక్రియలు సరిగ్గా ఉంటాయి. చలికాలంలో జ్వరం, దగ్గు, జలుబు వంటివి వేధిస్తుంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి.

వ్యాయామం తప్పనిసరి

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లు అత్యవసరమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లకూడదు. ఇంటి లోపల ప్రదేశాలు కూడా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలు, తలుపులు, కచ్చితంగా మూసివేయాలి. పండ్లు, కూరగాయలు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇన్‌ఫెక్షన్ రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. రోజు ఉదయం సాయంత్ర 30 నిమిషాల పాటు సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. విటమిన్ డీ, సీ అధికంగా ఉంటే పదార్థాలు తీసుకోవాలి. చెవిలో చల్లగాలి వెళ్లకుండా చూసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలి.

– విష్ణువర్ధన్ పామర్రు పీహెచ్‌సీ వైద్యులు

ఆరోగ్యంపై అవగాహన పెంచాలి



నాలుగు రోజుల నుంచి చలి బాగా ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులు అడుగు బయట పెట్టాలంటేనే భయపడుతున్నారు. ప్రతి సంవత్సరం చిలికాలం వచ్చిందంటే చాలు వృద్ధులు అనారోగ్యాలకు గురై చనిపోతారు. వారికి చలికాలం తీవ్రత బట్టి ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– ఇళ్లా సూర్యనారాయణ, శివల

మందులు అందుబాటులో ఉంచాలి



చలి కాలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలి. గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆసుపత్రిల్లో మందులు అందుబాటు ఉండేవి. కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం రోగాలకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచాలి.

– బత్తుల విజయకుమారి, మాజీ సర్పంచ్ కుందూరు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి, ట్రస్ట్ సభ్యులు

రాయవరం: స్థానిక సాయితేజా విద్యానికేతన్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి కుమారుడు సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ధాత్రి ట్రస్ట్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం స్నేహితులు ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా గత మూడేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిత్రులు, దాతల సహకారంతో ధాత్రి ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ పులగం శివారెడ్డి, సెక్రటరీ చింతా ప్రభాకరరెడ్డి, జాయింట్ సెక్రటరీ మల్లిడి శివకుమార్‌రెడ్డి, సభ్యులు ఎన్.సత్యజగదీష్, కర్రి సతీష్‌రెడ్డి, కర్రి తేజాపవన్‌మణికంఠరెడ్డి, కర్రి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పీఠంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న వేద పండితులు

రాయవరం: భక్తుల సంక్షేమం, లోక కల్యాణం కోసమే పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. విజయదుర్గా పీఠంలో గురువారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ భక్తుల క్షేమం కోరుతూ నిత్యం పీఠంలో హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి వైఖానస పండితులతో పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేసి, హోమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల విశిష్టతను వేద పండితులు భక్తులకు వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చినకాపు సేవలు చిరస్మరణీయం



కాపు భవనం వద్ద చినకాపు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు నాయకులు

మండపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, మండపేట కాపు అభ్యుదయ సంఘానికి మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి (చినకాపు) చేసిన సేవలు చిరస్మరణీయమని కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా అన్నారు. మండపేటలో గురువారం చినకాపు జయంతి నిర్వహించారు. సంగిత వెంకటరెడ్డి నగర్‌లోని కాపు కల్యాణ మండపం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్‌లో ఉన్న చినకాపు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రిగా చినకాపు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు మెండు బాపిరాజు, కార్యదర్శి యాళ్ల శ్రీనివాస్, కాపు నాయకులు పోతంశెట్టి వరప్రసాద్, పేపర్తి వీర వెంకట సత్యనారాయణ (సాంబు), శెట్టి నాగేశ్వరరావు, కొప్పిరెడ్డి కృష్ణ, రెడ్డి రత్తయ్య, కందుల శ్రీనివాస్, మీసాల రమణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



తనుమళ్లలోని సదస్సులో రైతుల నుంచి సమస్యలు వింటున్న తహసీల్దారు శివకుమార్



ఉండూరులో రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు

కాజులూరు: గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. గురువారం తనుమళ్లలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చు తగ్గులను సరి చేసుకోవాలన్నారు. మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, తదితర వాటిపై ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు పేపకాయల బాబ్జి, ఆర్ఐ వేగేశ్వర్రావు, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉండూరులో రెవెన్యూ సదస్సు

రామచంద్రపురం రూరల్: ఉండురులో జరిగిన రెవెన్యూ సదస్సును తహసీల్దార్ సావిత్రి, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వాసంశెట్టి సత్యదేవ ప్రసాద్, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు హాజరై రైతుల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వెల్ల సాగు నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు చిగురుపాటి సాయిరామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్లు, క్రాప్ లోన్ కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచి రీసర్వే సమస్యలపై రెండు దరఖాస్తులు మ్యుటేషన్ కోసం ఒక దరఖాస్తు మొత్తం 3 అర్జీలు అందాయి ఉప సర్పంచ్ పోతురాజు రజనీ కుమార్ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయిని అనసూయ

మండపేట: పేద విద్యార్థుల చదువులకు తలారి కటుంబ సభ్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆంధ్రా ఎవాంజెలికల్ లూథరన్ చర్చ్ మండపేట మండల అధ్యక్షుడు రెవరెండ్ ఖండవల్లి శామ్యూల్ అన్నారు. పట్టణానికి చెందిన స్వర్గీయ తలారి సైమన్ ప్రసాద్ మాస్టార్ కుటుంబ సభ్యులు ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఎపిఫానియా లూథరన్ చర్చిలో నగదు ప్రోత్సాహక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జవహర్‌లాల్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని బి.పల్లవి, వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని వై.కిరణ్మయిలకు సైమన్ మాస్టారు సతీమణి, విశ్రాంత ఉపాధ్యాయురాలు అనసూయ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ తలారి అమరేంద్ర ప్రసాద్, జీవిత బీమా సంస్థ సైబర్ సెక్యూరిటీ అధికారి తలారి సురేష్ కుమార్, వ్యవసాయ అధికారి తలారి పద్మజారాణి, లూథరన్ చర్చ్ సభ్యులు పాల్గొన్నారు.

30న కౌలు వేలం

కపిలేశ్వరపురం: మండలంలో అంగర పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న 1.4 ఎకరా ఖాళీ స్థలం, 30 కొబ్బరి చెట్లను సాగు చేసుకుని ఫలసాయం పొందేందుకు ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీ ఆవరణలో ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనవచ్చన్నారు. మూడేళ్ల పాటు సాగు షరతుపై నిర్వహించే వేలంలో పాల్గొనేవారు నిర్దిష్ట సమయానికి ఒక గంట ముందు ఆధార్ కార్డును చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

వంగవీటి మోహన్‌రంగాకు ఘన నివాళులు



అంగరలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మండపేటలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సత్యవాడలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని అంగర, కోరుమిల్లి, కపిలేశ్వరపురం, కేదారిలంక, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లోని గురువారం వంగవీటి రంగా వర్థంతి నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రంగా విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంగర గాంధీ సెంటర్‌లోని రంగా విగ్రహం వద్ద అంగర, పడమర ఖండ్రిక గ్రామాల నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, చీకట్ల గంగరాజు, పిల్లా బసవరాజు, వంగ నల్ల శ్రీను, పడాల రామకృష్ణ, యానాల సుబ్బారావు, కొంపెల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో గురువారం కాపు నేత వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి కాపునాడు మండల శాఖ అధ్యక్షుడునున్న వెంకటరమణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల సమస్యలపై పోరాడి అమరుడైన రంగా పోరాటయోధుడిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పేకేటి ఈశ్వరరావు, కాపు నాయకులు గరగ శ్రీనివాసరావు, శాకా కోటేశ్వరరావు, గరగ కామరాజు, శాకా చంద్రభగవాన్, నాగేంద్ర, సున్న ఈశ్వరరావు, రాకుర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగా వర్ధంతి

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ, ఊడిమూడి, కె.గంగవరం గ్రామాల్లో కాపునాయకులు గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని నిర్వహించారు. సత్యవాడ గ్రామంలో నాయకులు సలాది ప్రకాష్, సలాది రామకృష్ణ, చవాకుల వెంకటేశ్వరరావు, రాంబాబు, తోట చిన్నమాసరావు, బండారు బద్రి తదితరులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా పేద ప్రజలకు చేసిన సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మండపేట: బడుగు, బలహీన వర్గాల కోసం ప్రాణాలర్పించిన మహానేత వంగవీటి మోహనరంగా అని కాపు నాయకుడు జిన్నూరి సత్యసాయిబాబా, ఏడిద సొసైటీ మాజీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీహరి, పడాల సతీష్, వాసిరెడ్డి అర్జున్, మెండు బాపిరాజు, యాళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండపేట అర్బన్, రూరల్ పరిధిలో గురువారం వంగవీటి రంగా వర్ధంతి నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని రంగా విగ్రహానికి రంగా మిత్రమండలి అధ్యక్షుడు పడాల సతీష్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కాపు నాయకులు అధికారి శ్రీనివాస్, అన్నందేవుల శ్రీనివాస్, లంక రామారావు పాల్గొన్నారు. కాపు కల్యాణ మండపం, మెయిన్‌రోడ్డులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో నెలకొల్పిన రంగా విగ్రహానికి మండపేట కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పేపర్తి సాంబు, కొప్పిరెడ్డి కిట్టయ్య, శెట్టి నాగేశ్వరరావు, తణుకు అశోక్, శాకా సత్యనారాయణ, కందుల శ్రీనివాస్, దూలం నాగు, మీసాల రమణ, రెడ్డి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

కాజులూరు: దివంగత నేత వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు నాయకులు కృషి చేయాలని కాజులూరు తెలగా కాపు సంఘం నాయకుడు వంగా శ్రీనివాస్ (రంగా) అన్నారు. గురువారం వంగవీటి వర్ధంతి సందర్భంగా కాజులూరు మండల పరిషత్ కార్యాలయ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వంగా శ్రీనివాస్(రంగా) మాట్లాడుతూ కాపులలో రాజకీయ చైతన్యం తీసుకురావడం ద్వారా తమ సంఘం అభివృద్ధికి వంగవీటి మోహనరంగ ఎంతగానో కృషి చేశారన్నారు. పాలకులు కాపులకు సామాజికంగానూ, ఆర్థికంగానూ తోడ్పాటునందిస్తూ ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు యాళ్ల వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు యాళ్ల ధనరాజు, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

నయవంచన చేసిన కూటమి

- వైఎస్ఆర్‌సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- నేడు పోరుబాటకు తరలిరావాలని పిలుపు



పిల్లి సూర్యప్రకాశ్, కో ఆర్డినేటర్

రామచంద్రపురం: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు విద్యుత్ చార్జీల మోత మోగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను నయవంచన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. పట్టణంలో ఆయన గురువారం మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ శుక్రవారం జరిగే పోరుబాటు కార్యక్రమానికి ప్రజలు తరలిరాలని పిలుపు నిచ్చారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా శీలంవారి సావరం రోడ్డులోని ఏపీఈపీడీసీఎల్ డీఈ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని అనంతరం విద్యుత్ చార్జీల పెంపుపై డీఈ కార్యాలయంలో వినతి పత్రం అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మండపేట: సంక్రాంతి పండుగకు కొత్త దుస్తులు కొనుగోలు చేద్దామని వస్త్ర మార్కెట్‌కు బయలు దేరిన ఓ యువకుడు మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన ద్వారపూడిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవరం గ్రామానికి చెందిన గానుగల ప్రేమ్‌కుమార్ (16) నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ద్వారపూడిలోని వస్త్ర మార్కెట్‌కు మోటారు సైకిల్‌పై పయనమయ్యాడు. ఈ క్రమంలో ద్వారపూడి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. యువకుడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే గ్రామంలోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. చేతికి అందివచ్చిన కుమారుడు మరణించడంతో తల్లి బోరున విలపించింది. రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో నివాసముంటున్న ఈ కుటుంబం ఇటీవల మృతుడి తండ్రి మంగరాజు మరణించడంతో అక్కడి నుంచి కేశవరం వలస వచ్చారు. మళ్లీ ఇప్పుడు కొడుకు కూడా మృతి చెందడంతో ఆ తల్లి విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

ఘనంగా పణుగుదాలమ్మ ఆలయ వార్షికోత్సవం

కాజులూరు: జగన్నాథగిరి గ్రామ దేవత పణుగుదాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సుమారు 200ఏళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయాన్ని రెండేళ్ల క్రితం భక్తులు పునర్నిర్మించారు. మూడో వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహక కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి సాంప్రదాయ భరతనాట్యం, కోలాటం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది భక్తులు తీర్థమహోత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బాపిరాజుకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ నాయకులు

మండపేట: పట్టణానికి చెందిన ముమ్మిడివరపు బాపిరాజు తాతయ్య బాపిరాజు ఇటీవల మృతి చెందారు. కాగా బాపిరాజు కుటుంబ సభ్యులను పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్ తదితరులు బాపిరాజు నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతుని చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పార్టీ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, నాయకులు మెండి మురళి, పాలమాల సత్తిబాబు, గనిపే ఆనంద్, బత్తిన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కాజులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జే రాంబాబు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సభ్యులు, అధికారులు చర్చిస్తారన్నారు. గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సంస్థల ప్రతినిధులు, అన్ని శాఖాల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

మండపేట రూరల్ ఎస్ఐగా బుజ్జిబాబు

మండపేట: మండపేట రూరల్ ఎస్ఐగా పి.బుజ్జిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాయవరం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పనపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బుజ్జిబాబుకు సిబ్బంది పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.